

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

01 సెప్టెంబర్ 2025 పేజీలు : 08

సోమవారం


## వీఆర్ హైస్కూల్ ఓ అద్భుతం..

- రాష్ట్ర సలహాదారు సతీష్ రెడ్డి హర్షం
- మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్‌తో కలిసి విఆర్సీని సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్ర సతీష్ రెడ్డి
- మంత్రి నారాయణ ప్రత్యేక కృషితోనే.. వీఆర్ హై స్కూల్‌కు పూర్వ వైభవం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో వీఆర్ హై స్కూల్లో చూస్తే అద్భుతంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జాతీయ భద్రతా సలహా మండలి సభ్యులు గుండ్ర సతీష్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని విఆర్ హైస్కూల్ను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ తో కలిసి ఆయన హైస్కూల్‌ని ఆదివారం సందర్శించారు. మంత్రి నారాయణ ఎంతో అద్భుతంగా విఆర్ హైస్కూల్ను రూపురేఖలు మార్చేశారని, పాఠశాలను చూసి ఇంతలా ఉంటుందని ఊహించలేదన్నారు. కార్పొరేట్ వసతులతో -మిగతా 2లో

## గంగ ఒడిలోకి.. గణేశుడు







**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఘనంగా తాత్కాలిక గణనాధుని శోభాయాత్ర గణేష్ ఘాట్‌లో నిమజ్జనం స్థానిక ట్రంక్ రోడ్డు శివాజీ సెంటర్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శివాజీ మిత్రమండలి ఏర్పాటు చేసిన తాత్కాలిక గణనాధుని ఐదు రోజులు పూజ అనంతరం ఆదివారం సాయంత్రం ఘనంగా పురవీధులలో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. మేళ తాళాలతో కేరళ సింగారి మేళం బాణసంచా కోలాటాలు నడుమ భారత రక్షణ సలహాదారు పూర్వ డిఆర్డిఓ చైర్మన్ సతీష్ రెడ్డి స్వర్ణ భారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌లు గణనాధుని పూజలు నిర్వహించి శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంవత్సరం స్వామివారి లడ్డు వేలంపాట బదులు లక్కీ డ్రా ద్వారా లడ్డు అందించారు. ఈ కార్యక్రమంలో సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పి.సురేంద్ర రెడ్డి పిట్ సత్య నాగేశ్వరరావు యాదవ్ సీపారెడ్డి వంశీధర్ రెడ్డి కెవి సుబ్రహ్మణ్యం సూర్య ప్రకాష్ బిఎస్ రంగరాజన్ పివి రాఘవరెడ్డి ఏలూరు మహేష్ భాస్కర్ రావు శ్రీహరి ఏ వి స్వామి మూర్తి బిజెపి ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ హిందూ కుటుంబ సభ్యులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






## గణేష్ నిమ్మజ్జనంకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** వినాయక విగ్రహాల నిమజ్జనం 5వ రోజు సందర్భంగా ఎక్కువ మోతాదులో విగ్రహాల నిమజ్జనం కొరకు ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం వద్ద గల నిమజ్జన ప్రదేశం వద్ద భద్రతాపరంగా తీసుకున్న ప్రతిష్ట చర్యలపై జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. వినాయక విగ్రహాల ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చేటప్పుడు, తీసుకు వచ్చేటప్పుడు నిర్వాహకులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అదేవిధంగా బారికేడ్ల ఏర్పాటు, నాటు పడవలు సీసీ కెమెరాల పనితీరు, వినాయక విగ్రహాల ఊరేగింపు రాకపోకల దారులు, చిన్న, పెద్ద ఎత్తుగల విగ్రహల నిమర్జన ప్రాంతాలు, హారతి, భక్తుల రద్దీ, ప్రసాదాల వితరణ, వాహనాల పార్కింగ్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని, విగ్రహాలను ఎత్తే భారీ క్రేన్లను దానికి సంబంధించిన డ్రైవర్ లు అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనం ప్రాంతంలో పిల్లలు వృద్దులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిమర్జనం ప్రాంతంలో లైటింగ్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చావు లేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచిస్తూ ఆదేశించారు. అంతేకాకుండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు తెలియజేశారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ డైవర్షన్కు సహకరించాలని సూచిస్తూ ఇందుకు తగ్గట్టుగానే జిల్లా పోలీస్ శాఖ, మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖ, ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. నిమజ్జనం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, శాంతి కమిటీలు సంయుక్తంగా పోలీసు వారి నియమ నిబంధనలు తప్పక పాటించాలని, నిర్దేశిత ప్రదేశాలు, సమయాలలోని నిమజ్జనాలు పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. వినాయక విగ్రహాల వద్ద నిమజ్జనం ఊరేగింపు సమయంలో కొత్తవారిగాని, అనుమానిత వస్తువులు గాని ఉన్నచో వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసు అధికారులకు తెలియజేయాలని ఈ సందర్భంగా ఎస్పీ వివరించారు.

**గణేష్ నిమజ్జనం సందర్భంగా జొన్నవాడ వైపు వెళ్లే దారులు మళ్లింపు**

గణేష్ నిమజ్జనం ఐదవ రోజు సందర్భంగా ఎక్కువ సంఖ్య విగ్రహాలను ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం వద్ద గల గణేష్ ఘాటుకు భక్తులు విగ్రహాలు తీసుకు వస్తున్న నేపథ్యంలో రద్దీ కారణంగా జొన్నవాడ వైపుకు వెళ్లే వాహనదారులకు 31-08-2025 మధ్యాహ్నం రెండు గంటల నుండి 01-09-2025 ఉదయం వరకు కె.వి.ఆర్ పెట్రోల్ బంక్, పొదలకూరు రోడ్డు, పాత మున్సిపల్ ఆఫీస్ నుండి జొన్నవాడ వైపునకు వెళ్లే మార్గంలో గణేష్ విగ్రహంతో ఉన్న వాహనాలు తప్ప, ఇతర ఏ వాహనాలను పూర్తిగా అనుమతించబడదని, జొన్నవాడ వైపు వెళ్లే -మిగతా 2లో

## దైవభక్తి దేశభక్తి సమ్మేళనమే గణేష్ ఉత్సవాలు



ముప్పవరపు వెంకయ్య నాయుడు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో వినాయక చవితి ఉత్సవాల సమరోహంగా జరిగే నిమజ్జోత్సవాలకు భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా గణేష్ లోని స్వర్ణ లింగేశ్వర స్వామి దర్శించుకున్నారు తదుపరి గణేష్ ఘాట్ చిహ్నంగా గణేశుని విగ్రహాన్ని పూజలు చేసి ఆవిష్కరించారు మహిళల పూజలు కోలాటాలు కేరళ సాంస్కృతిక సింగారి మేళం భజంత్రీలు మధ్య నెల్లూరు చెరువులో గంగా హారతి నిర్వహించారు తదుపరి తాత్కాలిక గణనాథ నిమజ్జనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశభక్తి దైవభక్తి సమ్మేళనంగా బాలగంగాధర్ తిలక్ సామూహిక గణేష్ ఉత్సవాలను ప్రారంభించారని ఆయన ఆశయాలను అందరూ అనుసరించాలన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ 100 సంవత్సరాల పండుగ సందర్భంగా దేశభక్తి ధర్మానురక్తి ప్రజలందరికీ ఆకాంక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నూడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఆర్టిసి రీజినల్ చైర్మన్ సురేష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, -మిగతా 2లో

# కావ్య చీకటి సామ్రాజ్యాన్ని స్థాపించారు..

## వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడి చీకటి సామ్రాజ్యాన్ని స్థాపించారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున తెలిపారు. ఆదివారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అలియాస్ కత్తుల కొండయ్య తమ నాయకులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారాని తెలిపారు. కావ్య కృష్ణారెడ్డి అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో అనేక అక్రమాలు చేశారని చెప్పారు. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కావ్య కృష్ణారెడ్డి చేసే దుర్మార్గాలను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా బయటపెట్టేందుకు ప్రయత్నించారు. రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మీద తప్పుడు కేసులు బనాయించి హత్యాయత్నం కేసు నిసిగ్గుగా నమోదు చేయించారాని వివరించారు. హైదరాబాద్ నగరాల్లో పరిమితమైనటువంటి మనీ స్కీమ్ అనే స్కాంని నెల్లూరుకు తీసుకుని వచ్చి కావలి ప్రజల జీవితాలను సర్వనాశనం చేసిన వ్యక్తి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. మనీ స్కాం లో ఇరుక్కొని నష్టపోయిన బాధితుల కోసం వారి సమస్యను పరిష్కరించేందుకు కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ ఏర్పాటు చేసిన 24 గంటల్లోనే 50మంది పైచిలుకు బాధితులు కాలు మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి మొరపెట్టుకున్న పరిస్థితి అన్నారు. మనీ స్కాంలో తన పాత్ర బయటపడుతుందని రామిరెడ్డి పై హత్యాయత్నం కేసు నమోదు చేయించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న వ్యక్తి కావ్య కృష్ణా రెడ్డి అన్నారు. కావ్య కృష్ణారెడ్డి చేస్తున్న దుర్మార్గాలను చూసి కావలి ప్రజలు చీదరించుకుంటున్నారు. గొర్రెల ఫామ్ ఏర్పాటు చేసి కోట్లు దండుకొని ప్రజలు నట్టేట ముంచిన నీచాతి నీచమైన రాజకీయ నాయకుడు కావ్య అన్నారు. కావ్య కృష్ణారెడ్డి ఛాలెంజ్ ను స్వీకరించి అన్నవరం వస్తామని ప్రకటిస్తే, భయపడి తన తప్పులు ఎక్కడ ప్రజలకు తెలిసిపోతాయని అధికారం అడ్డుపెట్టుకొని పోలీసులను పంపి మా నాయకులను హౌస్ అరెస్ట్ చేయించాడు. కామర్స్ గా ఉద్యోగ జీవితం మొదలుపెట్టి, ఉద్యోగం సక్రమంగా చేయక, తరిమేస్తే బయటకు వచ్చి, ఈవియంలతో ఎమ్మెల్యేగా గెలిచిన నీకు మా నాయకుల గురించి మాట్లాడే స్థాయి ఉందాని ప్రశ్నించారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్







**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వెలమ సంఘం కార్యాలయంలో ఆదివారం వెంకటాచలం మండలం ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎన్.దశరథ రాములు మాట్లాడుతూ.. వెంటనే ప్రభుత్వం పీఆర్సీ ప్రకటించాలని, డీఏలు మంజూరు చేయాలని, అలానే ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హాజరత్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పై రుద్దుతున్న పరీక్షల అసెస్మెంట్ బుక్స్ ఉపాధ్యాయులపై రుద్దటం సరికాదని గతంలో మాదిరిగానే పరీక్షలు నిర్వహించాలని కోరారు. తదనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగింది. అధ్యక్షుడుటి నారాయణ, గౌరవ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షులు ఓ.సురేష్, డి.శుభహాన్, కె. వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్వి రమేష్ బాబు, కే.ఆదికుమారి, కార్యదర్శులు బి.సురేష్, ఆర్.శ్రీనివాసులు, ఏ.కృష్ణమూర్తి, చంద్ర శేఖర్, పి.నాగమణి, జిల్లా కౌన్సిలర్స్‌గా 7 మందిని, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## చవితి ఉత్సవాల్లో పాల్గొన్న రాపూరు సీఐ



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మేజర్ పంచాయతీలోని స్టేట్ బ్యాంక్ పక్కన పాత హరిజనవాడలో చిన్నపిల్లలు కలిసి చేస్తున్న వినాయక చవితి వేడుకల్లో రాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు .వినాయక చవితి ఐదవ రోజు నిమజ్జనం సందర్భంగా గత 15 సంవత్సరాల నుంచి 15 రూపాయల వినాయక బొమ్మ నుంచి పండగ చేస్తున్నారని తెలుసుకున్న రాపూరు సిఐ వినాయక బొమ్మ దగ్గరికి వెళ్లి పూజలు నిర్వహించి పిల్లలతో ఆనందంగా గడిపారు. నాకు పెద్ద బొమ్మ చిన్న బొమ్మ అని తేడా లేదు అని, భక్తి ముఖ్యమని ప్రతి సంవత్సరం ఇలాగే ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో పిల్లలు, ప్రజలు ఉన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్పేట మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదవ రోజైన ఆదివారం గణేష్ నిమజ్జనోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనుమసముద్రం ఏఎస్పేట బస్టాండ్ సెంటర్లోని వినాయక విగ్రహాన్ని గ్రామంలో బాణాసంచా కాల్చుతూ గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం సమీపంలో ఉన్న వాగుల్లో గణేష్ నిమజ్జనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు యువత గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీఆర్ హైస్కూల్ ఓ అద్భుతం..



(మొదటి పేజీ తరువాయి)

పెద్ద విద్యార్థులకు డిజిటల్ విద్యను బోధిస్తున్నట్లు వారు తెలిపారు. ఇక్కడ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మంత్రి నారాయణ దత్తత తీసుకోవడం ఎంతోమందికి స్ఫూర్తి దాయకమని తెలిపారు. మంత్రి నారాయణ ఒక విజన్ ఉన్న నాయకుడన్నారు. మంత్రి నారాయణ స్ఫూర్తితో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చిన్నారులను దత్తత తీసుకోవాలని తెలిపారు. వీఆర్ హై స్కూల్ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. మంత్రి ప్రత్యేక కృషితోనే విఆర్ హైస్కూల్‌కు పూర్వ వైభవం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు వీఆర్ హై స్కూల్ హెడ్ మాస్టర్ వెంకట్రావు, సిబ్బంది, మాజీ జెడ్పిటీసీ విజేతారెడ్డి పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనంకు పటిష్ట బందోబస్తు

(మొదటి పేజీ తరువాయి)

వాహనదారులు కోవూరు మీదుగా బుచ్చి వైపు నుండి వెళ్ళవలెనని అదేవిధంగా బుచ్చి నుండి జొన్నవాడ మీదుగా నెల్లూరుకు వచ్చే వాహనదారులకు కూడా బుచ్చి ఆర్చి వద్ద నిలబవేయబడుతుందని, బుచ్చి నుండి నెల్లూరు వైపు వచ్చే వాహనదారులు కోవూరు మీదుగా వెళ్ళవలెనని, కేవలం వినాయక విగ్రహాలు కలిగిన వాహనాలు మాత్రమే నిమజ్జనానికి వద్దకు అనుమతించబడునని.. ప్రత్యామ్నాయ మార్గాలలో వాహనదారులు వెళ్లాలని, ప్రజలు గమనించి పోలీసు వారికి సహకరించాలని, తదనుగుణంగా వాహన రాకపోకలు నిషేధిస్తూ భారీ కేడ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు.. ప్రజలు ఇందుకు సహకరించాలని టౌన్ సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## దైవభక్తి దేశభక్తి సమ్మేళనమే గణేష్ ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా బిజెపి అధ్యక్షుడు సిఫారెడ్డి వంశీధర్ రెడ్డి విక్రమార్క సంస్థ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు భయ్యా వాసు, విక్రమ సింహ పురి గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు, అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, ఈశ్వరయ్య, హర్షవర్ధన్, ఏవిఆర్ మోహన్ రావు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉచిత ధ్యాన, యోగ శిక్షణ ప్రారంభం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఉచిత ధ్యాన, యోగ శిక్షణ కార్యక్రమాన్ని, శ్రీ రుషి శక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రామ్మూర్తి నగర్ పద్మావతి కళ్యాణ మండపంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని సిహెచ్ రఘురామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది రోజులపాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో సూర్య నమస్కారాలు, ఆసనములు, ప్రాణామాయం, క్రియలు, ధ్యానము, ఆక్యు ప్రెజర్, మ్యాగ్నెటిక్ తెరపి, తదితర యోగాసనాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వాళ్లు తమను సంప్రదించాలని పిలుపునిచ్చారు.

# మైదానాలు లేక ఆటలకు ఆటంకాలు

## స్టేడియంకు మోక్షం కల్పించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో తగు మైదానాలు, ఆటస్థలాలు లేక ఆటలు, క్రీడలకు ప్రోత్సాహం కరువైందని సర్వత్రా వాపోతున్నారు. విద్యాసంస్థల్లో కానీ, ఇతర ప్రాంతాల్లో కానీ తగిన మైదానాలు, ఆటస్థలాలు లేవు. ఆటలు, క్రీడలను ప్రోత్సహించాలన్న లక్ష్యంగా 13 సంవత్సరాల క్రితం అప్పటి ఆత్మకూరు శాసనసభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులో స్టేడియం నిర్మాణానికి ఒకకోటి రూపాయలు నిధులు మంజూరు చేయించి టెండర్ ప్రక్రియను పూర్తిచేయించి పనులు ప్రారంభింపజేశారు. స్టేడియం నిర్మాణం కొంతవరకు పూర్తయి నిలిచిపోయింది. అనంతరం వచ్చిన పాలకులు ఎవ్వరూ ఈ స్టేడియం నిర్మాణం గురించి కనీసం యోచించిన దాఖలాలు లేవు. ఏదేని ఆటలు,క్రీడల పోటీల సందర్భంగా ప్రజాప్రతినిధులు అతిథులుగా హాజరుకావడం, తాము ఆటలు,క్రీడలకు అధికప్రాధాన్యత ఇస్తామని, క్రీడామైదానాలను, పార్కులను వృద్ధిచేస్తామని ప్రకటించడం, కరతాళధ్వనులతో జనాలు సంబరపడడం, అనంతరం నేతలు ఏమాత్రం ఆ విషయం గురించి పట్టించుకొనకపోవడం పరిపాటిగా మారింది. యువత ఏదేని పొలాల్లో కాసింత విశాలంగా జాగా కన్పిస్తే అక్కడ ఆటలాడుకోవడం కన్పిస్తుంటుంది. విద్యార్థులైతే పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో తీరికవేళల్లో ఆటలాడుకోవడం జరుగుతుంది. అంతేతప్ప నిర్ధిష్టమైన ఆటమైదానం లేదా స్టేడియం లేకపోవడం అత్యంత అసౌకర్యంగా ఉంటోంది. 13సంవత్సరాలుగా అర్ధాంతరంగా నిర్మాణం నిలిచిపోయిన స్టేడియం గురించి పాలకులు కానీ, అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకొనకపోవడం అత్యంత విడ్డూరంగా ఉంది. కొంతమేరకు నిధులు వెచ్చించి నిర్మాణం జరిగిన స్టేడియం గురించి పాలకులకు ఎందుకు పట్టదని పదేపదే పట్టణవాసులు ప్రశ్నిస్తూనే ఉన్నా ఫలితం లేకపోయింది. కాగా ఆనాడు ఆత్మకూరుకు స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఆత్మకూరు అభివృద్ధిప్రదాత ఆనం రామనారాయణరెడ్డి తాజాగా ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా కొనసాగుతున్నారు. గతంలో దాదాపు 2500కోట్ల రూపాయలతో ఆత్మకూరులో అనేక అభివృద్ధికార్యక్రమాలు చేసిన రామనారాయణరెడ్డి ఈదపా కూడా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. ఆయన ఈ స్టేడియం గురించి దృష్టి సారించి పూర్తిచేయించి విద్యార్థులు, యువతకు ఆటలు,క్రీడలకు అవకాశం కల్పించాలని సర్వత్రా కోరుతున్నారు.

## అటవీశాఖ రేంజ్ క్షేత్ర అధికారి అభినందన సభ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మినర్వాగ్రాండ్ లో అటవీ శాఖ రేంజ్ క్షేత్ర అధికారి రవీంద్రబాబు ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి సబ్ డిఎఫ్ఓ శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. జిల్లా అటవీశాఖ డివిజన్ పరిధిలోని రాపూరు అటవీ రేంజ్ క్షేత్రాధికారిగా పనిచేస్తూ పదవీవి రమణ చేసిన పందిళ్లపల్లి రవీంద్రబాబు బి.వాణి దంపతులను సన్మాన, సత్కారాలతో గౌరవించారు. కావలి సబ్ డివిజన్ డిఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కొలువుల్లో పనిచేసే ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే నన్నారు. 34 ఏళ్లపాటు సమర్ధవంతంగా తాను విధులు నిర్వహించాలని రవీంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సోషల్‌ఫారెస్ట్ డిఎఫ్‌వో నాగార్జునరెడ్డి, సహచర రేంజ్ ఆఫీసర్లు మాల్యాద్రి, కుమార్‌రాజా, రామిరెడ్డి, రావుశేఖర్, కొండపల్లి శివరామ కృష్ణ, ఎస్.పిచ్చిరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, ఖాజా రహంతుల్లా, రిటైర్డ్ రేంజ్ ఆఫీసర్లు, రాపూరు రేంజ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు పి.ప్రసన్న కుమారి, షేక్ ఖాజారసూల్, ఫ్లయింగ్ స్క్వాడ్ సెక్షన్ ఆఫీసర్లు టి.వర ప్రసాద్, చక్రపాణి, చంద్రశేఖర్, చరణ్, కార్యాలయ డిఈవో చంద్ర పాల్గొన్నారు.

## ఎన్ఆర్ పీఎస్ఏ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని డి.ఎస్.ఆర్. కళ్యాణ మండపంలో నెల్లూరు రూరల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, సినీ నటుడు కత్రి యోగి, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వెంకటేశ్వర నాయక్, ఎంఈఓ తిరుపాల్, రిటైర్డ్ ఎంఈఓ రమేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా 150 మంది ఉపాధ్యాయులు, 20మంది కరస్పాండెంట్లను సన్మానించారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మా కుటుంబంలో భాగమని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఎన్.ఆర్.పి.ఎస్.ఎ కార్యవర్గ సభ్యులు మల్లికార్జున రెడ్డి, షం షు ద్దీన్, సుబ్బయ్య, శేషు, సుధాకర్, హరినాథ్, భాస్కర్ రెడ్డి, వేణు, పివీ రెడ్డి, ప్రమీల చౌదరి, భాస్కరరావు, కృష్ణ చైతన్య, అమీర్జాన్, మస్తాన్, రోహిమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

# సాహిత్యాన్ని చారిత్రక, సాంస్కృతిక కోణాల్లో పరిశీలించాలి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** సేవా సాహితీ సంస్థ పక్షాన టౌన్ హాల్లో జరుగుతున్న మూడవరోజు ఆదివారం, ఉదయం మొదటి సదస్సు 'తెలుగుసాహిత్య విమర్శ' పై జరిగింది. సభాధ్యక్షులు, ప్రముఖకవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని 29 నుండి జరుగుతున్న ఈ సమావేశాలు ఒక్కోరోజు ఒక్కో సాహితీ ప్రక్రియపై ప్రముఖ ఉపన్యాసాలు జరుగుతున్నాయని, సాహిత్య విమర్శ సాహిత్య ప్రయోజనాన్ని, రచనలోతుల్ని విశదీకరిస్తుందని అన్నారు. ప్రసిద్ధ విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. విమర్శ రాయడం చాలా కష్టమైన బాధ్యత అని, కొడవటిగంటి కుటుంబరావు, సర్దేశాయి తిరుమలరావు వంటి వారు విమర్శలోని లోతుల్ని విశదీకరించారని తెలిపారు. కట్టమంచి వారు ఆధునిక విమర్శకు మార్గదర్శకులైనా, వారికి ఇష్టమైన రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ ఏకీభవించలేదని, నెల్లూరు ప్రాంతానికి చెందిన దువ్వూరి రామిరెడ్డి విమర్శ, పఠాభి విమర్శకు వైరుధ్యాలు ఉన్నాయని, కాబట్టి విమర్శ ఎప్పుడూ నిక్కచ్చిగా ఉండాలనేదానికి నిదర్శనమన్నారు. అనంతరం కీలకోపన్యాసకులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ.. విప్పి చెప్పేది విమర్శ అనే మాటను సరిచేసుకోవాల్సిన సందర్భం వచ్చిందని అన్నారు. నేటి విమర్శపై, పరిశోధనలపై అప్రకటిత ఆంక్షలను గుర్తుచేశారు. గద్దర్ సాహిత్యంపై పరిశోధన చేయకూడదని ఒక విశ్వవిద్యాలయంలో పోలీసులు వచ్చి చెప్పివెళ్లారని గుర్తుచేశారు. ఈరోజు సాహిత్య పత్రికల్లో విమర్శ వ్యాసాలు రాయాలంటే నియమనిబంధనలతో కూడిన జాబితా ఉంటుందని గుర్తుచేశారు. నేటి విమర్శ ఆకాశానికి ఎత్తడం, అధోపాతాళానికి తొక్కే విధాలుగా సాగుతుందని, విమర్శ రచయిత కష్టాన్ని సరిగ్గా అంచనా వేయాలని కోరారు. ఏ కోణంలో విమర్శ చేసినా సమదృష్టిని విస్మరించరాదని తెలిపారు. అలాగే ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నేటి విమర్శ ఏ కోణంలో సాగుతుందో విశదీకరించారు. ఆధునిక విమర్శపైన సాగుతున్న పరోక్ష ఆంక్షలను గుర్తుచేశారు. నేడు లోతైన విమర్శ 60 ఏళ్ల పైబడిన వారే వారే చేస్తున్నారని, యువత మెచ్చుకోలు విమర్శకు పరిమితమైందని, ప్రవచన కర్తలే సాహిత్య విమర్శకులైనారని, నేటి సినిమా, టీవీలలో వచ్చే సన్నివేశాలపై విమర్శ రావాలని కోరారు. అనంతరం ఆచార్య సిహెచ్ సుశీలమ్మ మాట్లాడుతూ.. సాహిత్యాన్ని మొత్తం చదవేశామనడం ఈ రోజు అలవాటుగా మారిందని, పుస్తకం చదివాక దాని రచయితతో మాట్లాడాలనిపించాలని, వర్గాన్ని ప్రోత్సహించడం కోసం విమర్శ ఉండకూడదని తెలిపారు. విమర్శలో ఖచ్చితత్వం ఉండాలని, ఇటీవల పరస్పర సహకారంతో విమర్శ సాగుతుందన్నారు. మంచి విమర్శకు అవార్డులు ఇచ్చే సాంప్రదాయం తక్కువగా వుందని, దాన్ని అదిగమించాలని కోరారు. అలాగే ఉన్నం జ్యోతి వాసు మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యంలో పాల్కురికి సోమనాథుడు తొలి సామాజిక కవి అవి అన్నారు. ప్రాచీన సాహిత్య విమర్శలో మొదట ఛందో వ్యాకరణ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారని, ఆధునిక కాలంలో సమాజిక సాహిత్య విమర్శ వికసించిందని తెలిపారు. ఆధునిక సాహిత్య విమర్శకు ఆలంకారిక సాహిత్య గ్రంథాల సాయం అవసరం లేదని అన్నారు. మనుచరిత్రలోని పదప్రయోగాల ప్రత్యేకతను విశదీకరించారు. శ్రీరామకవచం సాగర్ పోస్ట్ మోడ ర్నిజం గురించి మాట్లాడుతూ.. ఇది ఒక సిద్ధాంతం కాదని, ఒక ధోరణి అని అన్నారు. కవిత్వాన్ని సిద్ధాంత దృష్టితో పరిశీలిస్తే వాస్తవికమైన అంశాలు తెలుస్తాయని అన్నారు. డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. కవిత్వాన్ని చక్కగా విమర్శకుడు అంచనా వేయగలడని, 'వస్తువు కింద పడి మనిషి మరణిస్తున్నాడు, 'వాడు అల్లరి నిలవాలి సముద్రాన్ని లాగేందుకు ప్రయత్నిస్తున్నాడు' వంటి కవితా వాక్యల్లోని లోతును విమర్శనాదృష్టితో సమీక్షించారు. అలాగే డాక్టర్ కవితశ్రీ మాట్లాడుతూ.. సాహిత్య పూనర్మూల్యాంకనం నిరం తరం అవసరమన్నారు. మన సాహిత్యాన్ని చారిత్రక, సాంస్కృతిక కోణాల్లో పరిశీలించాలని అన్నారు. ద్రావిడ జాతి లక్షణాలను, వారి జీవన విధానాన్ని తెలియజేశారు. ఈ సభలో కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి రచించిన సేవ తెలుగు భాషా సాహితీ సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు ప్రముఖ సాహితీ వేత్తలకు సేవ గౌరవ పురస్కారం అందించారు. ఆచార్య కొలకలూరి ఇనాక్, నాగసూరి వేణుగోపాల్, గారపాటి ఉమా మహేశ్వరరావు, డా. నాళేశ్వరం శంకరం, చలం చర్ల భాష్కర రెడ్డి, కుసుమ కుమారి, డా. కొణిదెల శోభ, డా. కె.కరుణశ్రీ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# కన్నతల్లి, మాతృభాష, జన్మభూమిని మరువకూడదు





## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రిటైర్డ్ డెమో బి.శ్రీనివాసరావు

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** తెలుగు భాష వారోత్సవాలు జరుగుతున్న సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని బుజబుజ నెల్లూరు నందు డివిఎన్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో 90కి పైగా మార్కులు సాధించిన 22 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఆదివారం నాడు పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ డెమో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ.. తెలుగు ఉపాధ్యాయులైన అచ్యుతమణి విద్యార్థి ఫోటోతో కూడిన జ్ఞాపికలను, పెన్నులను అందజేయడం అభినందనీయమని, ఈ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లినా కూడా విద్యార్థుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, ప్రేమాభిమానాలతో అందజేయడం అభినందనీయం, ఎవరు కూడా కన్నతల్లిని మాతృభాషని జన్మభూమిని మరవకూడదని ఈ సందర్భంగా తెలియజేశారు. జిల్లా పీహెచ్‌పీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ సోదరి అనసూయ నాల్గవ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు జీవితాంతం ఉపయోగపడే జిప్ ఫైల్స్‌ను బహూకరించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష ఔన్నత్యానికి, మనుగడకు, విశేష కృషి చేసిన అచ్యుతమణిని అభినందించారు. అలాగే తెలుగు భాష కోసం అచ్యుతమణి చేసిన కృషికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పాఠశాల వ్యవస్థాపకులు దూడల ప్రసాదరావు, వెంకట నరసయ్య, పీహెచ్‌పీ జిల్లా కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ జిల్లా అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారాంపురం ఉదయగిరి వరికుంటపాడు వింజమూరు కలిగిరి కొండాపురం జలదంకి మండలాలకు సంబంధించిన 39 మంది బాధితులకు సుమారు 50లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయం నందు ఆయా మండల నాయకుల తో కలిసి ఆదివారం బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకొని ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా వైద్యం అందని వారికి సీఎం సహాయ నిధి నుండి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రభుత్వానికి అందరం అండగా ఉండాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నానని మీరందరూ తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు గూడా నరసారెడ్డి, సిహెచ్ బయన్న, మధు మోహన్ రెడ్డి, బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు పోలుబోయిన చంద్రబాబు నాయుడు, యారవ కిష్టయ్య, సర్పంచ్ పీవీ నాయుడు, బొల్లినేని వెంకట రామారావు, మంచాల శ్రీనివాసులు నాయుడు, కోడూరు నాగిరెడ్డి, బొజ్జ నరసింహులు, నల్లిపోగు రాజా, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, తదితరులు ఉన్నారు.

# చిన్నారులను పరామర్శించిన మేకపాటి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో 3 రోజుల క్రితం జరిగిన వినాయక నిమజ్జనంలో బాణాసంచా పేలి 9 మంది చిన్నారులకు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం వైయస్సార్ సీపీ నియోజకవర్గం సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి వైయస్సార్సీపి రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు, చేజర్ల సుబ్బారెడ్డిలు పరామర్శించారు. చేజర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత చేజర్ల సుబ్బారెడ్డిలు ఆత్మకూరు వైద్య శాలలో చేకిత్స పొందుతూన్న బాధితులు పరామర్శించారు. అనంతరం పాక్షికంగా గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 10వేలు రూపాయలు వంతెన ముగ్గురికి అందజేశారు. అనంతరం ఆత్మకూరులో చికిత్స పొందుతున్న మరో ముగ్గురికి 20వేల చొప్పున, నెల్లూరులో చికిత్స పొందుతున్న మరో చిన్నారికి 25వేలు మరొకరికి 5వేల రూపాయలు చొప్పున మొత్తం రూ. 1.20 లక్షలు అందజేశారు.

# నిమజ్జనానికితరలిన గణ నాథులు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణనాథులు వాడవాడలో కొలువుతీరి 5 రోజులుగా పూజలందుకున్నారు అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన నైవేద్యాలను స్వామివారికి సమర్పించి భక్తులకు పంచిపెట్టారు ఐదు రోజులుగా పూజలు అందుకున్న గణేశుడు ఆదివారం గంగమ్మ ఒడికి తరలుతున్నారు. వింజమూరులో పలు కూడళ్ళలో ఏర్పాటుచేసిన గణేష్‌ని విగ్రహాలను ఆదివారం 5వ రోజున అధిక సంఖ్యలో గణనాథులను తరలిస్తున్నారు యువత ఎంతో ఉత్సాహంతో గణేశ పూజ నిర్వహించి నిమజ్జనానికి ఉత్సాహాన్ని చూపుతున్నారు తప్పట్లో తాళాల మధ్య బాణా సంచాల పేలుళ్ల శబ్దంతో భక్తుల ఆనందోత్సాహాల మధ్య గణనాథులు నిమజ్జనానికి గంగమ్మ ఒడికి తరులుతున్నారు.

# భక్తిశ్రద్ధలతో గంధం దంచే కార్యక్రమం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ రహమతుల్లా నాయబ్ రసూల్ స్వాముల వారి 252వ ఉరుసు గంధ మహోత్సవంలో భాగంగా శ్రీ హబీబా ఖాతూన్ దొరసానమ్మ అమ్మ జాన్ గంధం దంచే కార్యక్రమాన్ని గంధ మహల్‌లో దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్, దర్గా వంశస్థులు ఎస్ జి ఎన్ ఫయాజ్ అహ్మద్, షకీల్ అహ్మద్ గౌస్ బాషా భక్తులు ప్రత్యేక ఫాతిహాలు చదివి ప్రారంభించారు. గంధం దంచడానికి మహిళా భక్తులు భారీగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గంధం దంచారు. ఏడాదికోసారి జరిగే ఈ కార్యక్రమంలో గంధం దంచడం ఎంతో సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. భక్తులకు దర్గా వంశస్థులు మంచినీరు ఏర్పాటు చేయగా వర్క్ బోర్డ్ ఆధ్వర్యంలో క్యూలైన్ల కొరకు బారికెట్లు షామియానాలు తదితర ఏర్పాట్లను చేశారు. సంగం సీఐ వేమారెడ్డి పరివేక్షణలో ఏఎస్పేట ఎస్ఐ ఏ. సైదులు పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సోమశిలలో లడ్డు వేలం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలం సోమశిల గ్రామంలోని వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజున బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద లడ్డు వేలంపాట నిర్వహించారు. గణనాథుని లడ్డూను గుండు బోయిన ఈశ్వరయ్య కుమారుడు విజయ్ కుమార్‌యాదవ్ 33వేల రూపాయలకు దక్కించుకున్నారు నగదును కీర్తిశేషులు లక్ష్మీనరసయ్య కుమారుడు గుండుబోయిన సుధాకర్ యాదవ్ 20వేల రూపాయలకు దక్కించుకున్నారు. అనంతరం గుండు బోయిన విజయకుమార్ యాదవ్‌కి మేళతాళాలతో ఇంటికి సాగనంపారు.

# వినాయక నిమర్జన కమిటీ సమావేశం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి సర్కిల్ పరిధిలో ఆదివారం జరగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉదయగిరి సీఐ వెంకట్రావు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డిలు కమిటీ సభ్యులకు సూచించారు. మొన్న అప్పసముద్రంలో బాణాసంచా ఖాళీ తొమ్మిది మంది చిన్నారులకు గాయాలు అయ్యాయని ఇటువంటి ఘటనలు జరగకుండా నిమజ్జనా కార్యక్రమం ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని అదేవిధంగా నిమజ్జనం సమయంలో చిన్నారులు, వృదులు నీళ్లలో దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలిగిరి మండలం, తూర్పుగుడ్లదోనలో నిమజ్జన సమయంలో ప్రమాదవశాత్తు నీళ్లలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని సూచించారు.

# 50 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గం లోని దుత్తలూరు మండలాన్ని మినహాయించి, ఏడు మండలాలకు సంబంధించిన 39 మంది బాధితులకు సుమారు 50లక్షల సీఎం సహాయనిది చెక్కులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయం నందు మండల నాయకులతో కలిసి ఆదివారం బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకొని ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా వైద్యం అందని వారికి సీఎం సహాయనిధి నుండి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని ప్రభుత్వానికి అందరం అండగా ఉండాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నానని మీరందరూ తోడ్పాటును అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు గూడా నరసారెడ్డి, సిహెచ్ బయన్న, మధు మోహన్ రెడ్డి, బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు పోలుబోయిన చంద్రబాబు నాయుడు, యారవ కిష్టయ్య, సర్పంచ్ పీవీ నాయుడు, బొల్లినేని వెంకట రామారావు, మంచాల శ్రీనివాసులు నాయుడు, కోడూరు నాగిరెడ్డి, బొజ్జ నరసింహులు, నల్లిపోగు రాజా, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, తదితరులు ఉన్నారు.

# స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని పిలుపు



- ప్రతిభా సేతు ప్లాట్‌ఫారమ్.. వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించిన కేంద్రం
- 'మన్ కి బాత్'-ప్రధానమంత్రి సందేశాన్ని ప్రజలతో పంచుకున్న బీజేపీ నేత చిలకా ప్రవీణ్ కుమార్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** 'మన్ కి బాత్'-ప్రధానమంత్రి సందేశాన్ని ప్రజలతో పంచుకున్న బీజేపీ జిల్లా నేత చిలకా ప్రవీణ్ కుమార్ నెల్లూరు రూరల్ 19వ డివిజన్ శ్రీనగర్ నగర్‌లోని 172వ బూత్‌లో జరిగిన 'మన్ కి బాత్' కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలోని ముఖ్యాంశాలను బీజేపీ జిల్లా నాయకుడు చిలకా ప్రవీణ్ కుమార్ స్థానిక ప్రజలతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ విపత్తుల బాధితులకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారని, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు జమ్మూ-కాశ్మీర్‌లో ఖేలో ఇండియా ఉత్సవాలను కేంద్రం నిర్వహిస్తున్నదని, రష్మితా సాహు, మోహ్సిన్ అలీ వంటి క్రీడాకారుల విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారని తెలిపారు. వేలాది యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కేంద్రం ప్రారంభించిన ప్రతిభా సేతు డిజిటల్ వేదికను వివరించారు. సౌరశక్తితో గ్రామీణాభివృద్ధి సాధించడానికి 'సోలార్ దీదీ' వంటి విజయాలు మహిళలకు ఆదర్శమని, వృత్తిదారుల అభివృద్ధి కోసం విశ్వకర్మ యోజన పథకం ప్రారంభించామని చెప్పారు. స్వదేశీ ఉత్పత్తులను వినియోగించాలని, స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించాలని ప్రధాని ఇచ్చిన 'వోకల్ ఫర్ లోకల్' పిలుపును ప్రజలకు తెలియజేశారు. పండుగల సమయంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని సూచించారని, ప్రతి భారతీయుడు స్వయంప్రతిపత్తి సాధనలో భాగస్వామి కావాలని, దేశాభివృద్ధి కోసం కృషి చేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారని తెలిపారు. చివరిగా చిలకా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. 'ప్రధాని ప్రతి పిలుపు మనందరికీ ప్రేరణ. మన్ కి బాత్‌లో చెప్పిన ప్రతి అంశం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా మార్గదర్శకంగా ఉంటుంది. మనందరం కలసి దేశాభివృద్ధిలో భాగస్వాములమవ్వాలి' అని అన్నారు.

# ఉదయగిరి జిల్లా చేసేందుకు మద్దతు ఇవ్వండి

## భారత పూర్వ ఉపరాష్ట్రపతిని కోరిన ఉద్యమ నాయకులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోనే వెనకబడివున్న ఉదయగిరి పరిసర మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లా చేయాలని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడును ఉద్యమ నాయకులు ఆదివారం వెంకటాచలంలోని స్వర్ణ భారతి ట్రస్టులో కలిసి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల, డివిజన్ల, మండలాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రవర్గ ఉపసంఘాన్ని నియమించి ప్రజాభిప్రాయం సేకరిస్తున్న సందర్భంగా ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు ఆయనను కలిశారు. ఉదయగిరి నియోజవర్గ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించి, ఇక్కడి స్థిగతులన్నీ అవగాహన ఉన్నందున ఉదయగిరి జిల్లాగా ఏర్పాటు చేసేందుకు మద్దతు ఇవ్వాలని వారు వెంకయ్య నాయుడును కోరారు. గత ప్రభుత్వం వద్ద ఉదయగిరి జిల్లా ప్రతిపాదనలు చేస్తే ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని 8 మండలాలను మూడు ముక్కలుగా చేసి కావలి కందుకూరు ఆత్మకూరు రెవెన్యూ డివిజన్లలలో కలిపిందని చెప్పారు. అన్ని రంగాలలో వెనకబడివున్న ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే జిల్లా చేయడం ఒక్కటే మార్గమని వారు వెల్లడించారు. పూర్వ ఉప రాష్ట్రపతిని కలిసిన వారిలో ఉదయగిరి



మాజీ శాసన సభ్యుడు కంభం విజయరామి రెడ్డి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎల్ సి రమణా రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ నాయకులు ఎం.బాలకృష్ణ రెడ్డి, ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు ఎండి ఖాజా, పాముల రమణయ్య తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి కృతజ్ఞతలు

- కొట్టాయపల్లి సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలం కొట్టాయపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా గడ్డం వెంకటేశ్వర్లు నూతనంగా ఎంపికయ్యారు. ఆ పదవి రావడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆదివారం నాడు వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట సొసైటీ డైరెక్టర్లుగా ఎంపికైన బొజ్జ నరసింహులు, నల్లిపోగు రాజా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బయన్న, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## వెంకయ్య నాయుడును కలిసిన అంకెనపల్లి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** స్వర్ణ భారతి ట్రస్ట్ నెల్లూరులో ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ అంకెనపల్లి ఓబుల్ రెడ్డి ఇతర నేతలతో వెంకయ్య నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సత్కరించారు. నల్గొండ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులను చేపట్టవలసిన పనులను వివరించారు.

# విద్యుత్ ఘాతంతో బాలుడి మృతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని కంసాలివీధిలో విద్యుదాఘాతానికి గురై షేక్ సమీవుల్లా(10) అనే బాలుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోట చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యూనియన్ రోడ్డుకు చెందిన షేక్ నూరేమస్ మూద్, నబియా దంపతులకు ఇద్దరు పిల్లలు కలరు. వారిలో పెద్దవాడైన సమీవుల్లా నార్త్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సమీప కంసాలీవీధిలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికెళుతున్నాడు. ఈ తరుణంలో వీధిలో వెళుతూ సమీపాన ఉన్న ఇనువవైపును పట్టుకోవడంతో షాక్కు గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన స్థానికులు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కంసాలివీది ఇరుకైన సందు కావడంతో సమీపంలో విద్యుత్ స్తంభాలు లేవు. దీంతో నివాసాల వారు సుదూరాన ఉన్న విద్యుత్ స్తంభం నుంచి సర్వీసు వైర్లు లాగి వాటికి సపోర్టుగా మధ్యలో ఇనుప పైపులను ఏర్పాటు చేశారు. అందులో ఓ సర్వీసు వైరు దెబ్బతిని పైపుకు గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా వస్తుందని, వృద్ధులు, చిన్నారులు షాక్‌కు గురవుతున్నారని సంబంధిత సిబ్బందికి సూచించారు. సమస్యపై విద్యుత్ సిబ్బంది సరిగా స్పందించకపోవడంతో బాలుడి మృతికి కారణమైందని స్థానికులు వాపోతున్నారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వైద్యశాలతోపాటు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ట్రాన్స్ కో ఏఈ ఖుద్దూస్ బాషా సైతం తన సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# విశ్రాంత ఉపాధ్యాయులకు కాట్వా ఘనసన్మానాలు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాపుటీచర్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులుగా ఉంటూ ఉద్యోగ విరమణ గావించి ఉపాధ్యాయులు సంచుల వెంకటేశ్వర్లు, లక్కాకుల హైమావతిలను ఆదివారం కాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వారికి ఉద్యోగవిరమణ వీడ్కోలు పలికారు. సంచుల వెంకటేశ్వర్లు దంపతులను, లక్కాకుల హైమావతి దంపతులను సుబ్బారావు, ఆయన సతీమని శారదమ్మ, పలువురు కాట్వా నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం సతీమణి నళినమ్మ తదితరులు శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, కానుకలతో ఘనంగా సన్మానించి వారికి ఉద్యోగవిరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమతం సుబ్బారావు మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు, హైమావతిలు మూడున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయవృత్తిలో ఉంటూ విద్యార్థులెందరెందరినో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి సేవలందించారని కొనియాడారు. వారు ఉద్యోగవిరమణ గావించినందున శేష జీవితం ప్రశాంతంగా కొనసాగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వారు కాట్వాలో కీలకంగా వ్యవహరించారని, భవిష్యత్తులో కూడా అదేతరహాలో కొనసాగాలని ఆయన కోరారు. ఎంతో చిత్తశుద్ధితో వారు విధులు నిర్వహించారని, పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిలో అంకితభావంతో పని చేశారని సుబ్బారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాట్వా జిల్లా, నియోజకవర్గ తదితర స్థాయి నాయకులు పాపిశెట్టి నరశింహులు, వడ్ల విష్ణుమోహన్‌రావు, మద్దూరు మల్లికార్జున, కూరాకు విజయ, శీలం రమేష్, నలగండ్ల మురళీకృష్ణ, డాక్టర్ గునుకుల శివయ్య, తదితరులు పాల్గొనగా వారందరికీ సన్మానగ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్ట్‌కు మాతృవియోగం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరుకు చెందిన ప్రముఖ దినపత్రిక జర్నలిస్ట్, ఆర్‌సి ఇన్‌చార్జ్, ఆంధ్రప్రదేశ్ యూనియన్‌ఆఫ్ వర్కింగ్‌జర్నలిస్ట్స్ జిల్లా కార్యవర్గ సభ్యులు బైనబోయిన వెంకటేశ్వర్లు తల్లి బైనబోయిన చిన్నక్క(85) ఆదివారం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. వయోభారంతో ఆమె ఇటీవల అస్వస్థతకుగురై స్తానిక హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. సమాచారం అందుకున్న ఏపియుడబ్ల్యుజె నాయకులు, ఆత్మకూరు ప్రాంత జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు ఆమె మృతికి ప్రగాఢసంతాపం వ్యక్తం చేసి వెంకటేశ్వర్లుకు సానుభూతి తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు వెంకటేశ్వర్లు స్వగ్రామమైన అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడులో చిన్నక్క మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు.

## పుట్టుకతో లోపాలున్న వారికి ప్రభుత్వ సేవలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లాప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో ఉన్న బాలభవితకేంద్రంలో పుట్టుకతో ఏదేని లోపాలున్నవారికి వైద్యసేవలందిస్తున్నామని ఈకేంద్ర వైద్యాధికారి తెలిపారు. కొందరికి వంకరపాదాలు, గ్రహణమొర్రి, తదితర 12లోపాలుంటాయన్నారు. అలాంటి వారికి ప్రభుత్వబాలభవిత కేంద్రంలో వైద్యసేవలు లభిస్తాయన్నారు. పురిటిబిడ్డల నుండి 18సంవత్సరాలలోపువారికిఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. న్యూరల్‌ట్యూబ్ డిఫెక్ట్‌లు, డౌన్‌సిండ్రోమ్, గ్రహణమొర్రి, వంకరపాదాలు, పుట్టుకతోనే వినికిడిలోపం, సంక్రమిత కంటిపొర, గుండెసంబంధిత వ్యాధులు, నాడీమండల సమస్యలు, జ్ఞానపరంగా అభివృద్ధిలో ఆలస్యం, మాటలు సరిగా రాకపోవడం తదితర సమస్యలకు చికిత్స అందిస్తామన్నారు. ఈ కేంద్రంలో చిన్నపిల్లల వైద్యులు, వైద్యాధికారి, డెంటల్ వైద్యులు, సామాజిక కార్యకర్తతోపాటు మానసికంగా అభివృద్ధిలేని పిల్లలకు విడతలవారీగా సైకాలజిస్ట్ కౌన్సిలింగ్ చేస్తారన్నారు. శారీరక ఎదుగుదల లోపాలున్నవారికి ఫిజియోథెరపి సౌకర్యం కూడా ఉందన్నారు. ల్యాబ్ సౌకర్యంతోపాటు కంటివిభాగం, స్టాఫ్‌నర్సులు కూడా ఉన్నారని, అవసరమైన వారు బాలభవితకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఎల్‌ఆర్‌పల్లి పార్కును బాగుచేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్.ఆర్.పల్లిలో ఉన్న ఎస్‌ఎంకె పార్కును బాగుచేయాలని సిపిఎం నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, కమీషనర్ సి.గంగాప్రసాద్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనాదిగా ఈ పార్కులో చిన్నారులు, యువత ఆటలాడుకుంటుండేవారని, వయోవృద్ధులు వాకింగ్ చేస్తుండేవారని వారు పేర్కొన్నారు. కొంతకాలంగా ఈ పార్కు ముళ్ళచెట్లతో నిండుకొని నిరుపయోగంగా ఉందని వారు వివరించారు. ఆర్డీవో, తహశిల్దారు, ఎంఎవో కార్యాలయాలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాల, కోర్టు, పోలీస్‌స్టేషన్, సిఐ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్‌ట్రెజరి తదితర కార్యాలయాల మధ్య ఉన్న ఈపార్కు కంపచెట్లతో నిండుకొని నిరుపయోగంగా ఉండడం బాధాకరంగా ఉందని, వెంటనే బాగు చేయాలని, అలా చేయకుండా ప్రజాందోళనకు దిగుతామని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ సిపిఎం అధ్యక్షుడు కె.డేవిడ్‌రాజు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ షేక్ సందాని, రైతుసంఘ అధ్యక్షుడు పి.కృష్ణమోహన్, పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డులు, ఫించన్ల కోసం ఎదురుచూపులు

## ఏడాదిన్నరైనా విడుదల కాని ఉత్తర్వులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నూతనంగా రేషన్‌కార్డులు, వివిధ రకాల పెన్షన్లకు అర్హులైన వారు ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వులకోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులు చేసుకోవాలంటూ సోషల్‌మీడియాలో అప్పుడప్పుడూ కన్పిస్తుందేకానీ ఇంకా ప్రభుత్వం తగిన ఉత్తర్వులివ్వలేదు. అర్హతల నియమావళిని కూడా విడుదల చేయలేదు. అయితే వివిధ పెన్షన్లు, రేషన్‌కార్డులు, సంక్షేమకార్యక్రమాల మంజూరులో అర్హులందరికీ న్యాయం చేయాలని, గతప్రభుత్వంలోఉన్న నిబంధనలను సడలించాలని వివిధ వర్గాల ప్రజలు కోరుతున్నారు.గత ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తే ఇబ్బందికరమని కొందరు, కొన్ని నిర్ణయాలు అమలుచేయకుంటే ఇబ్బందికరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చని, రిజిస్టర్ చేసుకోవచ్చని నిర్ణయించారు. దాదాపు ఏడాదిక్రితం ఈ సర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి గత ఏడాది ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రోహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెందిన ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## పెన్షన్లకు గత ప్రభుత్వ నియమాలు పాటించవద్దు

వివిధ రకాల పెన్షన్ల కొనసాగింపు, మంజూరుకు గత వైసిపి ప్రభుత్వ నియమాలు అమలుచేయవద్దని, చాలామంది తీవ్రంగా నష్టపోతారని అనేకమంది పెన్షనర్లు, పెన్షన్‌కు అర్హులైనవారు కోరుతున్నారు. గత ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న రైస్‌కార్డుదారులందరూ అర్హులు కాగా విద్యుత్ వినియోగం నెలకు 300యూనిట్లుకన్నా అధికంగా ఉందని, ఇంటికొలతలు అధికంగా ఉన్నాయని, నాలుగుచక్రాల వాహనాలున్నాయని, కుటుంబసభ్యులు ఆదాయపన్నులు చెల్లిస్తున్నారంటూ అనేకమందిని అనర్హులుగా చేసి పెన్షన్‌లు రద్దుచేశారు. అర్హులు నూతనంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. దాంతో అందరూ లబోదిబో అంటూ తీవ్ర ఆవేదనకు గురికాగా పెన్షన్లను రద్దుచేసి పలువురికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కాగా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం అదే నియమాలను అమలుచేయనుందని, అనర్హులంటూ పలువరి పెన్షన్లకు ముప్పురానుందని, కొత్తగా పెన్షన్ల మంజూరుకు గత నిర్ణయాలు, నియమాలు పాటించనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత నిర్ణయాలు అమలు ఉంటుందా లేదా, తాజా నిర్ణయాలా అనేది ప్రభుత్వం నుండి సచివాలయాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదంటున్నారు. ఏదేమైనా అర్హులకు నియమావళి అంటూ రైస్‌కార్డుదారులకు నూతన పెన్షన్లు మంజూరుకాకున్నా, ప్రస్తుతం ఉన్న పెన్షన్లు రద్దయినా అనేకమంది నష్టపోయేపరిస్థితి, ఆందోళనకుగురయ్యే పరిస్థితి, అలజడి చెలరేగే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం పునరాలాలోచించి గతంలో తెలుగుదేశం అమలుచేసిన నియమావళినే ప్రాతిపదికన తీసుకోవాలని, వైసిపి నియమాలు అమలుచేయరాదని, సాధారణ,మధ్య తరగతి కుటుంబాలవారు కూడా విద్యుత్ 300యూనిట్లకన్నా అధికారంగా వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని, బిడ్డలు చదువుకుంటూ కనీస అవసరాలను వాడుకూటుంటారని, అలాంటివారిని గమనించాలని, ఆంక్షలపేరుతో పెన్షన్లు రద్దుచేయారాదని అనేకమంది కోరుతున్నారు.

## టిడ్కోగృహాలు మంజూరైనవారికి పట్టాలివ్వాలి

గతంలో తెలుగుదేశం ప్రభుత్వహయాంలో నిర్మించిన టిడ్కోగృహాల నిర్మాణాలను పూర్తిచేసి లాటరీ విధానంలో లబ్దిదారులకు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం వాటిని గురించి పట్టించుకొనకుండా ఎన్నికలు సమీపించే పరిస్థితిలో మళ్ళీ గృహాలను కేటాయించారు. అయితే ఆత్మకూరులో చూస్తుంటే 1050 గృహాలు కాగా ఇప్పటివరకు ఐదారువందలమంది అక్కడకు నివాసాలు మార్చుకున్నారు. గతంలో చెప్పిన విధంగా అక్కడ గుడి,చర్చి,మశీదు, పార్కు, స్కూలు, అంగన్‌వాడీ కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించారు. పార్కుకు సంబంధించి మెటీరియల్ కూడా అక్కడకు చేర్చారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి గురించి ఆలోచించిన పాపానపోలేదు. కాగా కొన్ని గృహాలు ఖాళీలుండగా అర్హులు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. విఆర్వో, కమీషనర్,ఆర్డీవోల అర్హులుగా ఆమోదించి ఫైనల్‌గా జాయింట్ కలెక్టర్‌కు ప్రాతిపాదించగా అక్కడ కూడా ఆమోదం పొంది గృహాలు మంజూరయ్యాయి. అయితే వారికి పట్టాలిచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పట్టాపుస్తకాలపై గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫోటోలున్నాయని అధికారులు నిలిపివేశారు. ఈ ప్రభుత్వం ఆపాస్‌బుక్‌లను మార్చి లబ్దిదారులకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. ఈవిషయమై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆత్మకూరులో బస్సుల సమస్యలు పరిష్కరిస్తారా లేదా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో ఆర్టీసీ బస్సుల సమస్యలు పరిష్కరిస్తారా లేదా, సరిపడా బస్సులు సమకూరుస్తారాలేదా అని సర్వత్రా ప్రశ్నిస్తున్నరు. బైపాస్ అంటూ అనేక బస్సులు రెవిన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గకేంద్రం, మున్సిపల్ పట్టణమైన ఆత్మకూరుకు రాకుండా వెళుతుంటాయి. నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై ఆత్మకూరు మండలం కరటంపాడు, మర్రిపాడు మండలం డి.సి.పల్లి, మండకేంద్రమైన మర్రిపాడు, నియోజకవర్గకేంద్రమైన ఉదయగిరికి వెళ్ళాలంటే ఆత్మకూరు నుండి నేరుగా బస్సులు లేనందున అందరూ ఆటోల్లో నెల్లూరుపాళెంకు 20రూపాయలు భరించి వెళ్ళి అక్కడ బస్సులు ఎక్కాల్సిఉంది. బద్వేలు, కడప, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్ళాలన్నా నెల్లూరుపాళెంకు ఆటోల్లో వెళ్ళాల్సిందే. ఈసమస్యలు అనాదిగా ఉన్నాయి. ప్రయాణీకులు పెరిగారు, మహిళలకు ఉచిత బస్‌సౌకర్యం లభించింది. అందుకుతగిన విధంగా బస్సులను పెంచడం లేదు.అనేక గ్రామాలకు బస్‌సౌకర్యం లేదు. ఈసమస్యలను గురించి ఎన్నిదపాలు అధికారుల దృష్టికి తీసుకెళుతున్నా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించడం లేదు. పెరుగుతున్న ప్రయాణీకులకు సరిపడా ఆర్టీసీ బస్సులను పెంచాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు. సాధారణంగా అనేకమంది వేళాపాళా లేకుండా గ్రామీణ ప్రాంతాలకు సక్రమంగా బస్సులు లేక ఆటోలను ఆశ్రయిస్తుంటారు. కొన్ని మార్గాల్లో బస్సులు నడపనందున అనివార్యమై ఆటోలనే ఆశ్రయిస్తుంటారు. అయితే ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించడం, అందులోభాగంగా స్త్రీశక్తి పధకాన్ని ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం నాడు ప్రారంభించడం తెల్సిందే. దాంతో ప్రయాణీకుల సంఖ్య కూడా బాగా పెరగనుందని అంచనాగా ఉంది. ఉచిత ప్రయాణం అనగానే మహిళలు ఆర్టీసీ బస్సులను ఎక్కాలని నిర్ణయించుకుంటారు. వారితోపాటు పురుషులు కూడా ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్ళాల్సి ఉంటుంది. అందువలన ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకుతగ్గట్లుగా బస్సుల సంఖ్యను పెంచాల్సిన అవసరం అనివార్యం. అదీగాక కొన్ని గ్రామీణ ప్రాంతాలకు బస్‌సౌకర్యం లేదు. ఆయా మార్గాల్లో మహిళలు ఉచితప్రయాణ అవకాశం కోల్పోవాల్సి ఉంటుంది. బంట్లపల్లి,వెన్నవాడ, ఆరవేడు, ఏ.జంగాలపల్లి తదితర గ్రామాలకు బస్‌సౌకర్యం లేదు. ఆత్మకూరునుండి నేరుగా ఉదయగిరి, మర్రిపాడు ప్రాంతాలకు బస్‌సౌకర్యం లేదు. ఆత్మకూరు మండలంలోని కేవలం 10కిలోమీటర్లలో నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై బి.చిరువెళ్ళ, కరటంపాడు గ్రామాలకు, మరో 3కిలోమీటర్లలో అదే మార్గంలోని మర్రిపాడు మండలం డి.సి.పల్లికి నేరుగా బస్‌సౌకర్యం లేదు. ప్రయాణీకులు 20రూపాయల అదనపువ్యయం భరించి ఆట్లో నెల్లూరుపాళెంకు వెళ్ళి అక్కడ ఆర్టీసీ బస్సులు ఎక్కి ఆయా గ్రామాలకు వెళ్ళాల్సి ఉంటుంది. ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడుకు, ఆమండలంలోని గ్రామాలకు ఆత్మకూరునుండి బస్సులు లేనందున ఆటోలకు 20రూపాయలు వెచ్చించి అక్కడ ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి ఉంది. ప్రస్తుతం మహిళలకు ఉచిత బస్‌ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించినా స్తానిక ఆర్టీసీ అధికారులు అన్ని ప్రాంతాలకు బస్సులు నడపనందున ఉచిత సౌకర్యం కోల్పోయే పరిస్థితి ఏర్పాడి ఉంది. దాంతోపాటు పెరగనున్న ప్రయాణీకులను కూడా దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్యను పెంచాల్సి ఉంది. అనంతపురం, కర్నూలు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పుట్టపర్తి, ప్రొద్దుటూరు, కడప, బద్వేలు, బనగానపల్లి, వాకాడు, ఉదయగిరి డిపోల బస్సులు బైపాస్ అంటూ పట్టణంలోకి రాకుండానే నెల్లూరుపాళెం నుండి నేరుగా రాకపోకలు సాగిస్తుంటాయి. కనీసం అన్ని మార్గాల్లో ఆత్మకూరు డిపోనుండైనా అవసరమైన మేరకు బస్సులు నడపాలని సర్వత్రా కోరుతున్నారు. మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన ఉచితప్రయాణసౌకర్యాన్ని వారికి అందకుండా చేయరాదని, అన్నిమార్గాల్లో, గ్రామీణ ప్రాంతాలకు బస్సులను ఏర్పాటు చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

## రాత్రివేళ బస్సులు ఆత్మకూరుకు రాకపోవడం అత్యంత ఇబ్బందికరం : చాంద్‌బాషా



రాత్రివేళ్ళ నడిచే అనేక బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా నేరుగా నెల్లూరుపాళెం నుండి వెళుతుండడం ప్రజలకు అత్యంత ఇబ్బందికరంగా ఉందని రిటైర్డ్ హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.చాంద్ బాషా పేర్కొన్నారు. అనాదిగా ఈ సమస్యకు పరిష్కారం లేకపోవడం విచారకరమన్నారు. ఆత్మకూరు ప్రాంతంలో గ్రామాలకు, ప్రధానంగా జాతీయరహదారిపై గ్రామాలకు కూడా నేరుగా బస్‌సౌకర్యం లేకపోవడం కూడా తీవ్ర అసౌకర్యంగా ఉంటుందన్నారు. ఈపరిస్థితిని అధికారులు గమనించాలని, అన్నిప్రాంతాలకు బస్సులను నడపాలని చాంద్‌బాషా కోరారు.

## సమీపగ్రామాలకు బస్‌సౌకర్యం లేకపోవడం విచారకరం : గార్లపాటి



ఆత్మకూరు సమీపగ్రామాలకు ఆర్టీసీ బస్‌సౌకర్యం లేకపోవడం విచారకరమని మండలంలోని కరటంపాడుకు చెందిన మాజీ ఉపమండలాధ్యక్షుడు, గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్ నాయుడు పేర్కొన్నారు. రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న ఆత్మకూరుకు 3కిలో మీటర్లలో నెల్లూరు-ముంబాయి రహదారి ఉండగా ఉదయగిరివైపు, బద్వే లు వైపు వెళ్ళే బస్సులన్నీ ఆత్మకూరు పట్టణంలోకి వెళ్ళకుండా నేరుగా వెళుతుండడం ప్రయాణీకులకు అత్యంత అసౌకర్యంగా ఉందన్నారు. ఆత్మ కూరు మండలంలోని సమీపగ్రామాలకు కూడా నేరుగా బస్ లేనందున ఆటోల్లో నెల్లూరుపాళెం వెళ్ళి అక్కడనుండి బస్సుల్లో ప్రయాణించాల్సి రావడం జనాలకు వ్యయ, ప్రయాసలుగా ఉంటుందన్నారు. అదీగాక మహిళలకు ఉచిత బస్ ప్రయాణను ప్రభుత్వం కల్పించగా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేనందున ఈ అవకాశాన్ని మహిళలు కోల్పతున్నారని, ఆర్టీసీ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వేణుగోపాల్‌నాయుడు కోరారు.

## దగ్గరగ్రామాలకు కూడా రెండు వాహనాల్లో ప్రయాణాలు : బాబు



ఆత్మకూరుకు 10, 15కిలోమీటర్లలో ఉన్న గ్రామాలకు కూడా ప్రజలు వెళ్ళాలంటే ఒక ఆటో, ఒక ఆర్టీసీ బస్సులో ప్రయాణించాల్సి వస్తుందని, దాంతో ప్రజలకు అవస్థలుగా ఉంటుందని ఆత్మకూరు శ్రీరామా నాట్యమండలి కార్యవర్గసభ్యులు, మున్సిపల్ ఉద్యోగి దేవరపాటి చిన్నబాబు పేర్కొన్నారు. కరటంపాడు, డి.సి.పల్లి, మర్రిపాడు, రాంపల్లి, నందిపాడు తదితర గ్రామాలకు వెళ్ళాలంటే ఆత్మకూరునుండి ఆటోలో నెల్లూరుపాళెంకు వెళ్ళి అక్కడనుండి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి కొనసాగుతుందన్నారు. దాంతో జనాలు అదనపు భారం భరించాల్సి వస్తుందన్నారు. అధికారులు పరిశీలించి ఈమార్గాల్లో కొన్ని బస్సులను నడపాలని చిన్నబాబు కోరారు.

## గ్రామాలకు బస్సులునడకుంటే ఉచితసౌకర్యం కోల్పోతున్న మహిళలు : రాధ



ఆత్మకూరు ప్రాంతంలో అనేకగ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపనందున ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్‌ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు కోల్పతున్నారని అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్టుకమిటీ ప్రధానకార్యదర్శి పి.రాధ పేర్కొన్నారు. ఆత్మకూరు ప్రాంతంలోని ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం, మర్రిపాడు, సంగం, చేజర్ల మండలాల్లో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్‌సౌకర్యం లేదన్నారు. ప్రభుత్వం ఇటీవల మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా ఆయా గ్రామాల మహిళలు ఉచిత సౌకర్యం కోల్పోతున్నారని ఆమె పేర్కొంటూ అధికారులు పరిశీలించి గ్రామాలకు బస్‌సౌకర్యం కల్పించాలని రాధ కోరారు.

## సమీపగ్రామాలకు నేరుగా బస్సులు లేకపోవడం అసౌకర్యం : కిన్నెర



ఆత్మకూరు ప్రాంతంలోని నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై పలుగ్రామాలకు, ఉదయగిరి మార్గంలోని గ్రామాలకు నేరుగా ప్రయాణించేలా బస్సులు లేకపోవడం అత్యంత అసౌకర్యంగా ఉందని మండల నాయీబ్రాహ్మణసంఘ నాయకుడు, శ్రీపెనుశిల లక్ష్మీనరశింహస్వామి ఆలయ ఫెస్టివల్‌కమిటీ మెంబర్, టిడిపి సాంస్కృతికవిభాగం కార్యదర్శి కిన్నెర నరశింహారావు పేర్కొన్నారు. ఆత్మకూరునుండి ప్రయాణీకులు నెల్లూరుపాళెంకు ఆటోల్లో ప్రయాణించి అక్కడనుండి గ్రామాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం అదనపు వ్యయం భరించాల్సి వస్తుందని, లగేజిలుంటే మరింతగా ఇబ్బందిపడాల్సి వస్తుందని నరశింహారావు పేర్కొంటూ ఆత్మకూరు-ఉదయగిరి, ఆత్మకూరు-మర్రిపాడులమధ్య కొన్ని బస్సులను నడపాలని ఆయన కోరారు.

## ఉపాధి పనుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** వ్యవసాయ కార్మిక సంఘం మండల 3వ మహాసభ అనంతసాగరం అతిధిగృహం వద్ద జరిగింది. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ.. కేంద్రంలో ఉండే బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తుందని అన్నారు. ఉపాధిహామీ పనులు చేసిన కూలీలకు బకాయి డబ్బులు విడుదల చేయలేదని వెంటనే కూలీల డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలగే గ్రామాల్లో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల వలన పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కావున ఉపాధి హామీ పనులు ఎక్కువగా కల్పించాలని అన్నారు. వ్యవసాయ కార్మికులకు, పేదలకు ప్రభుత్వ భూములు పంచాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని దాని కోసం వ్యవసాయ కార్మిక సంఘం భూపోరాటం నిర్వహిస్తామని అన్నారు. అనంతరం 13మందితో నూతన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటి ఏర్పాటు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా బందుల వెంకటరమణ, నాగులూరు వెంకటేష్‌లను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో సీఐటీయు అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా, జనవిజ్ఞాన వేదిక నాయకులు గాడి సుధాకర్, రైతు సంఘం సీనియర్ నాయకులు ఉప్పలపాడు మస్తాన్, రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్ మరియు అన్ని గ్రామాల వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ తల్లిని తిట్టిన వారిపై చర్యలు తీసుకోండి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీహార్‌లో ఓట్ చోరీ పేరుతో ఇండి కూటమి చేపట్టిన యాత్రలో మోడీని దొంగ అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆ వేదిక పైనే రాహుల్ ప్రియాంక గాంధీలు తేజస్వి యాదవ్ సమక్షంలో ప్రధాని తల్లిని మహమ్మద్ రిజ్వి మహిళా సమాజం వినలేని పదంతో దూషించారు. ఆ వ్యాఖ్యానంపై దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్న రాహుల్ గాంధీ ఆ వ్యాఖ్యలను ఖండించలేదు. మహిళ అయినా ప్రియాంక గాంధీ కూడా నీచ వ్యాఖ్యలను విని మౌనంగా ఉండడం భారత మహిళలను అవమానపరచడమేనని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సభలో పాల్గొన్న ఇండి కూటమి నేతలు యావత్ భారత సమాజానికి క్షమాపణలు చెప్పాల్సిందే.. భారతదేశ రాజకీయాలలో జాతీయ స్థాయి నేతల మధ్య నీచమైన సంస్కృతిని రాహుల్ గాంధీ ప్రోత్సహిస్తున్నారు. మహిళా లోకం గాంధీ కుటుంబం యొక్క వాస్తవ రూపాన్ని అర్థం చేసుకుంటున్నారు. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని రమేష్ పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సు, కారు ఢీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణ శివారు ప్రాంతంలోని సీతారామపురం మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై బస్సు, కారు ఢీకొన్న సంఘటన ఆదివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతారామపురం నుంచి ఉదయగిరికి వస్తున్న ఆర్టీసీ బస్సు పట్టణంలోకి వచ్చేందుకు మలుపు తిరుగుతోంది. ఈ తరుణంలో మర్రిపాడు మండలం నాగరాజుపాడు నుంచి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు కారులో స్వగ్రామమైన ఉదయగిరి మండలం నేలటూరుకు వెళుతూ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బస్సు, కారు ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో ఎవరికీ ఏలాంటి గాయాలు కాలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు.

# ఎమ్మెల్యే కావ్యని అసహ్యించుకుంటున్న నెల్లూరు ప్రజలు

## వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పేర్నెటి కోటేశ్వర రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కావలిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వెలుగులోకి తీసుకొచ్చేందుకు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ప్రయత్నిస్తే అది నేరం అన్నట్లుగా ఆయనపై కూటమి ప్రభుత్వం 307, ఎస్సీ, ఎస్టీ అక్రమ కేసులు నమోదు చేయడం దుర్మార్గమని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రెటరీ పి కోటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం సిటీ వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కార్యకర్తల్లో మనో ధైర్యం నింపేందుకు కావలి వచ్చి అక్రమ మైనింగ్‌పై మీడియాతో మాట్లాడితే కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి ఎక్కడలేని ఆగ్రహం కలిగిందన్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కాకాణి గోవర్ధన్ రెడ్డిని, అలాగే పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని తిట్ల దండకంతో రెచ్చిపోయి కావలి వస్తే మీ తలలు నరుకుతా కావలికి రండి చూసుకుందామని ఛాలెంజ్ చేశారు. ఆ ఛాలెంజ్‌ను స్వీకరించి మా నాయకులు కావలికి వెళ్లే ప్రయత్నం చేస్తే అధికార బలంతో అక్రమ గృహ నిర్బంధం చేశారని ధ్వజమెత్తారు. కావలి వెళ్ళి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి అండగా నిలబడాలని వైసీపీ ప్రయత్నిస్తే ఎక్కడికక్కడ పోలీసులు వైఎస్ఆర్సిపి నేతలను గృహ నిర్బంధం చేసి అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. తమ నాయకులు పర్వతరెడ్డిపై ఈమధ్య ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అవాకులు చావాకులు పేలుతున్నారని చంద్రశేఖర్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత కావ్యకృష్ణారెడ్డికి లేదన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌పై కావ్య కృష్ణారెడ్డికి అవగాహన.. లేదన్న విషయం ఇటీవల ప్రెస్‌మీట్‌లో ఆయన వాక్యాలను బట్టి అర్థమవుతుందన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు ఓట్లు వేస్తే చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీ అయ్యారని కావ్య కృష్ణారెడ్డి వ్యాఖ్యా నించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. ఈవీఎంలు కలిసి వచ్చి కావ్య కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని పూర్తిగా రాజకీయ అజ్ఞాని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అని అన్నారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గెలుపొంది చరిత్ర సృష్టించారన్న విషయం కావ్య కృష్ణారెడ్డి గుర్తుపెట్టుకోవాలి. ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఒక ఉపాధ్యాయుల సమస్యలే కాకుండా రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కార దిశగా మండలిలో తన వాణి వినిపించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అన్యాయాలు అక్రమాలు, ఆకృత్యాలను పర్వతరెడ్డి ప్రశ్నిస్తున్నారనే ఒకే ఒక కారణంతో పర్వతరెడ్డిపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండి పడ్డారు. కావలిలో ప్రెస్‌మీట్ పెట్టి తమ నేతలు మీరు చేస్తున్న అక్రమాలను మీడియా ముఖంగా చెబితే వాటికి సమాధానం చెప్పకుండా పారిపో యారని అన్నారు. ఏదైనా సమస్య వస్తేసబ్జెక్ట్ ముఖంగా దాని గురించి మాట్లాడి ప్రశ్నించే వ్యక్తి పర్వతరెడ్డి అని అన్నారు. అంతేగాని మీలా వ్యక్తిగత దూషణలకు పోయే వ్యక్తి కాదని అన్నారు.




నేటి దినపత్రిక సూర్య

# విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

**నేటి దినపత్రిక సూర్య కార్యాలయం**
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

**9000118811, 9000483583**


# బారా షహీద్ దర్గాలో ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ బారా షహీద్ దర్గాలో ఆదివారం సాయంత్రం ముస్లిం నేతలు, మత పెద్దలు, మైనార్టీ కార్యకర్తలు కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై జరుగుతున్న కుట్రల నుండి ఆయన కాపాడబడి, ఆయన్ను దుష్టశక్తులు ఏవీ తాకకుండా ఉండాలని అల్లాహ్ దయ కలగాలని సమిష్టిగా ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సహా వారి కుటుంబ సభ్యులు సుఖశాంతులతో ఉండాలని, ఎలాంటి విపత్తులు రాకుండా దైవానుగ్రహం ఉండాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సమీహుసేని, షంషుద్దీన్, సాబీర్ ఖాన్, అబూబకార్, ఇస్మాయిల్ ఖాదరి, అబ్దుల్ రసూల్, షేక్ మస్తాన్, ఖాదర్ బాష, అస్లాం, జిలాని, రియాజ్, ఫయాజ్, మీరా, బషీర్, షాజీద్, ఖలీల్, సుల్తాన్, గులాం రసూల్, ముజామిల్, అహమ్మద్ తదితర ముస్లిం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** శ్రీ శివకేశవుల దేవస్థానం, రాజగోపాలపురం, కొండా బాలరామి రెడ్డి వీధి, క్రాంతినగర్ నందు శ్రీకృష్ణ వినాయకుడును తాత్కాలిక విగ్రహ నిమజ్జనోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. పై కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండా నిరంజన్ రెడ్డి, లాయర్ లోకనాదం, ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ తాటిపర్తి బాలాజీ పాల్గొన్నారు. లడ్డును మునిరాజ్, రాజేష్ ఖన్నా 10116/-లకు పాడుకున్నారు. కార్యనిర్వాహకులుగా విజయ్, గోవింద్, వెంకటేష్, కుమార్ సురేంద్ర, సాయి, యంగమ్మ, నంద, హరి, ఇతరులు పాల్గొన్నారు. 5 రోజులు వినాయకచవితి వేడుకలు ఘనంగా ముగిశాయని శ్రీ శివకేశవుల దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య తెలియజేశారు.

# వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వ్యవసాయరంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో 5వ ఏరియా రైతు సంఘ మహాసభ నిర్వహించారు. తొలుత జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని ఆదానీ, అంబానీలాంటి కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేస్తున్నాయన్నారు. రైతన్నను నాశనం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి రక్షించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే వ్యవసాయరంగాన్ని కాపాడ కోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరి ఉందన్నారు. పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ సరికాదన్నారు. విద్యుత్ లాభసాటి వ్యాపారం కాబట్టి ఆదానీకి ఆ రంగాన్ని కట్టబెట్టేందుకు స్మార్ట్మీటర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి సీతారాం సాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకు వెంకటయ్య, ఎంపీటీసీ విజయమ్మ, మట్టె హరినారాయణ, పావులూరి నాగేశ్వరరావు, పచ్చవ వెంకటేశ్వర్లు, కోడె రమణయ్య, పందిళ్ల వెంకటేశ్వర్లు. నాయబ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ ఎంపిక. ఈ సందర్భంగా తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు వారిలో అధ్యక్ష, కార్యదర్శులుగా పచ్చవ వెంకటేశ్వరు, కాకు వెంకటయ్యలతోపాటు మరో ఏడు మంది సభ్యులను ఎంపిక చేశారు.

# పడారుపల్లి దగ్గర గణేష్ లడ్డు వేలం

**1,35,000 దక్కించుకున్న కాకుటూరు బ్రదర్స్**



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ నియోజకవర్గం పడారుపల్లి లోని శివాలయం అరుగు దగ్గర గణేష్ లడ్డు వేలంపాట కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణేష్ లడ్డు వేలం పాటలో పోటా పోటీగా నిర్వహించిన వేలంలో పడారుపల్లి వాస్తవ్యులు కాకుటూరు మస్తానయ్య, శ్రీహరి, కుటుంబ సభ్యులు 1,35,000 గణేష్ లడ్డు దక్కించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పడారుపల్లి ఉత్సవ కమిటీ మరియు 23వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి 22వ డివిజన్ కార్పొరేటర్ మూలే విజయ్ భాస్కర్ రెడ్డి, చల్లా సుబ్బారావు 23 డివిజన్ అధ్యక్షుడు మేకలమధు యాదవ్, పాముదు సుధాకర్ రెడ్డి, బాబూజీ, శివయ్య, కాకు చిన్న కామయ్య, చంద్రశేఖర్, వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.